


# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా






సంపుటి - 07 | సంచిక 164 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం 15, మే 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




పలు రకాల మలుపులు తిరుగుతున్న పోక్సోకేసు

నిందితునికి లగ్జరీ అవకాశాలు

బాధితురాలికి పలు రకాల అవమానాలు

పోలీసులకు నిందితునికి మధ్య మెయిల్స్ రాయబారాలు నడుస్తున్నాయి

నిందితున్ని వెనకేసుకొస్తున్న వివిధ పార్టీల మహిళ నేతలు

మైనర్ బాలికపై ఏఐ ఫోటోల ప్రయోగాన్ని వాడుతున్నారు

పోక్సో కేసులో మైనర్ బాలికకు ఇంతటి అవమానం ప్రభుత్వ నిర్లక్ష్యమే

కేసు కట్టింది పోలీసులు అంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలను ఎద్దేవ చేస్తున్న సీఎం

మైనర్ బాలిక తరపున న్యాయపోరాటం చేస్తున్న బక్క జడన్స్ తెలంగాణ శ్యామ్

అప్పుడే కేటీఆర్ పై గురిపెట్టిన అధికార పార్టీలు

మాజీ ఐపీఎస్ డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోరాటం

అదరహో : డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# కొలిక్కిరాని.. కేసు విచారణ !



హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

చట్టం చాలా గొప్పదని డాక్టర్ బరిగెల శివ అభిప్రాయం వ్యక్తం చేశారు. చట్ట పరిధిలో నమోదు చేయబడుతున్న కేసులో ప్రతి ఒక్కరికి సమానమైన విచారణను కొనసాగించాలి గాని వ్యక్తుల పలుకుబడిని బట్టి చట్టంలోని కేసుల విచారణను కొనసాగిస్తుండడం చాలా విచారంగా ఉందన్నారు. గడుస్తున్న ఐదు రోజులుగా కొంతమంది అజ్ఞాత వ్యక్తులు ఏఐ సహాయంతో రూపొందించబడిన మైనర్ బాలిక ఛాయాచిత్రాలను వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఎంతో అసభ్యకరంగా ఎంతో అసహ్యంగా మైనర్ బాలికపై విరుచుకుపడుతున్నారని తీవ్రంగా హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మైనర్ బాలిక తల్లి పెట్టినటువంటి కేసు గురించి మాత్రమే ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు గాని బండి సాయి భగీరథ్ కరీంనగర్ లో మైనర్ బాలిక కుటుంబంపై పెట్టిన కేసును గురించి ఏ ఒక్కరు ప్రస్తావించడం లేదన్నారు. పోలీసులు కేసు కట్టిన విధానం విచారణ కొనసాగిస్తున్న విధానంలో మైనర్ బాలికలు సంబంధించిన వయస్సును చదువుకు సంబంధించిన ధృవపత్రాలను ఇతరత్రా ఆధారాలను అన్నిటిని ఇప్పటికే న్యాయస్థానానికి సమర్పించారని కేసు కట్టిన విధానాన్ని తప్పుపడుతూ నిందితుని తరపున న్యాయవాది మైనర్ బాలికను తప్పుపడుతూ తన కుటుంబాన్ని తప్పుపడుతూ తనకేం అన్యాయం జరగలేదు అన్నట్లుగా న్యాయస్థానాన్ని తప్పు పట్టిస్తూ కేసు వాదించడమే కాకుండా ఏకంగా న్యాయస్థానంలో అరవడం మైనర్ బాలిక కుటుంబం ఎంతో వేదన పడుతుందన్నారు. బీఆర్ఎస్ మినహాయిస్తే

- మిగతా 2లో..

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు

పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి

పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య

6



## ఫార్ములా ఈ-కార్ రేసు - కేటీఆర్ కు నోటీసులు



కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు

జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం

ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్

6

## హిందువులకు క్షమాపణ చెప్పిన కమెడియన్ అలీ

6

అసలేమిటీ 'ఘర్ సోప్' వివాదం?

## ఇక ఫస్టియర్ లోనూ ప్రాక్టికల్స్

తెలంగాణ ఇంటర్ లో కీలక మార్పులు!


విద్యార్థుల్లో ప్రాక్టికల్స్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు

2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు

ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్

7



## కేయూ సర్వే నివేదికలో సాహస వీరులు

3

కేయూ భూముల రక్షణలో కలెక్టర్ వాకాటి కరుణ రుణం తీర్చుకోలేనిది

నాటి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ ఐఏఎస్ ప్రోత్బలం మరువలేనిది

ఆర్డీవో వాసు చంద్ర, డిఐ.ఎం సారంగపాణి నిజమైన సాహసం చేశారు

అప్పటి హన్మకొండ ఎమ్మార్వో రాజ్ కుమార్ అత్యంత ధైర్యాన్ని ప్రదర్శించారు

జిల్లా కలెక్టర్ నివేదికలను కనుమరుగు చేసిన మూర్ఖులకు కమ్మని బుద్ధి చెప్పారు

టాంపర్ చేయబడిన దొంగ రికార్డులను సర్వే నివేదికతో సరి చేశారు

సర్వే నివేదిక ద్వారా కేయూ భూముల రక్షణకు శాశ్వత పరిష్కారం అందించారు

పాత ఏడి బ్రోకర్ అవతారం నుండి కేయూ భూమిని కాపాడినారు

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

## మల్లంపల్లి గ్రామంలో.. ఘనంగా బడిబాట కార్యక్రమం

**ర్యాలీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





**వరంగల్ జిల్లా/దుగ్గొండి, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో నిర్వహించిన బడిబాట ర్యాలీతో పాటు ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన కల్పించారు. విద్య హక్కు ప్రతి చిన్నారికి అందాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులకు సమతుల పౌష్టికాహారం, మెరుగైన మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఉత్తమ బోధన అందుతోందని పేర్కొన్నారు. ప్రతి తల్లిదండ్రి తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మల్లంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదివిన విద్యార్థిని కావ్యశ్రీ ఎస్సెస్సీ పరీక్షల్లో 566 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానం, జడ్పీ పాఠశాలల విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించడం గర్వకారణమని కలెక్టర్ అభినందించారు. ఈ విజయాన్ని ఆదర్శంగా తీసుకొని మరింత మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణి, ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి, డీఈఓ రంగయ్య నాయుడు, దుగ్గొండి తహసీల్దార్ సమ్మక్క, ఎంపీడీవో, సీఎంఓ డాక్టర్ కే. శ్రీనివాస్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, జెడ్పీహెచ్ఎస్ మల్లంపల్లి ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర భార్గవి, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

### రూ.10 వేల లంచం తీసుకుంటూ ఆర్ఐ రాంబాబు పట్టివేత

**వరంగల్ జిల్లా/దుగ్గొండి, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ జిల్లా దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాంబాబు రూ.10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భూ సంబంధిత పని పూర్తి చేయడానికి ఆర్ఐ రాంబాబు లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా అధికారులు ముందస్తు ప్రణాళికతో ఉచ్చుపన్ని, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. దాడుల అనంతరం ఏసీబీ అధికారులు తహసీల్దార్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. సంబంధిత ఫైళ్లు, పత్రాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో దుగ్గొండి తహసీల్దార్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. రెవెన్యూ శాఖలో అవినీతి ఆరోపణలు మళ్లీ చర్చనీయాంశంగా మారాయి. ఏసీబీ అధికారులు ఆర్ఐ రాంబాబుపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ కేసులో మరెవరైనా అధికారుల ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని సహించబోమని, ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

# కొలిక్కిరాని కేసు విచారణ

మొదటి పేజీ తరువాయి

మైనర్ బాలికకు సహాయంగా నిలుస్తున్నది చాలా తక్కువ వ్యక్తులని చెప్పుకోవాలన్నారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మైనర్ బాలికకు అండగా నిలుస్తున్నారని ఏకంగా వాళ్లే ఈ కేసును నడిపిస్తున్నట్లుగా ప్రభుత్వం బిజెపి నేతలు వాళ్లపై విరుచుకుపడుతూ దుష్ప్రచారాలు చేస్తుండడం వికారంగా ఉందన్నారు.కేసు కట్టింది కాంగ్రెస్ ప్రభుత్వంలోని పోలీస్ అధికారులన్న సంగతిని ప్రతి ఒక్కరు గుర్తుకు పెట్టుకోవాలని సూచించారు.మైనర్ బాలిక కేసు పై రాష్ట్రవ్యాప్తంగా భిన్నవాదనలు వినిపిస్తూ కొంతమంది అల్ప ఆనందం పొందడం కోసం మైనర్ బాలిక కుటుంబంపై తీవ్రమైన నిందలు వేస్తూ అబాసుపాలు చేస్తుండగా కొంతమంది మైనర్ బాలిక తరపున గట్టిగా పట్టుబడుతూ నిందితున్ని అరెస్టు చేయాలని పోరాటాలు ఉద్యమాలు ధర్నాలు చేస్తున్నారని గుర్తుకు చేశారు.బండి సాయి భగీరథ్ పై ఫోక్సో కేసు వర్తించదు అంటూ వాదనలు వినిపించిన నిందితుని లాయర్ బండి సాయి భగీరథ్ ను నిందితుడు అనొద్దు అంటూ న్యాయస్థానంలో గొడవకు దిగడం బడే నాటకీయంగా ఉందన్నారు.మైనర్ బాలిక తల్లి షేర్ బషీర్బాగ్ పోలీస్ స్టేషన్ లో చదువుతోపాటు ఇతర వ్యక్తిగత ఆధారాలను చదువు ధృవపత్రాలను పోలీస్ స్టేషన్లో సమర్పించి పక్క నిరూపణ జరిగిన తర్వాతనే సుమారు ఐదున్నర గంటల సుదీర్ఘ సమయం తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిన సంగతిని సదరు లాయరు మర్చిపోవడం అనాలోచితంగా ఉందన్నారు.అస్తమానం మైనర్ బాలిక మేజర్ అనే పద్ధతిలోనే కేసు నడుపుతున్నాడు తప్ప మైనర్ బాలికను సెక్సువల్ అరాచ్మెంట్ లో భాగంగా పలుమార్లు లొంగ తీసుకొని అఘాయిత్యానికి పాల్పడ్డాడని న్యాయవాది నోటిలో నుండి మాట రాకపోవడం యావత్ న్యాయవాద వ్యవస్థకు తీరని మచ్చ లాంటిదన్నారు.బాధితుల తరఫున సహాయపడుతూ న్యాయం కోసం పోరాటం చేయడం న్యాయవాదుల లక్షణమైనప్పటికిని అసలు కేసును మరిచిపోయి మైనర్ బాలికను మేజర్ అమ్మాయని వాదించడం కోసం తెగ ప్రయత్నం చేసిన విధానం తీవ్రంగా మనస్థాపానికి గురి చేసిందని గుర్తు చేశారు.బండి సాయి భగీరథ్ ను ముందస్తుగా అరెస్టు చేస్తారనె నెపంతో మధ్యంతర బెయిల్ కోసం ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారని పదే పదే తెలుపుతున్న లాయర్ ఫోక్సో కేసుకు ముందస్తు బెయిల్ వర్తించదన్న సంగతిని ఎందుకు మరిచిపోయాడంటూ సుటిగా నిలదీశారు.తెలంగాణ ప్రజల్ని మరోరకంగా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం బండి సాయి భగీరథును అరెస్టు చేయకుండా కాలయాపన చేస్తూ తెలంగాణ ఉద్యమకారులను తెలంగాణ ప్రజాసంఘాలను తెలంగాణలోని పార్టీలను పోరాటాలకు ఉద్యమాలకు ధర్నాలకు రెచ్చగొడుతుందని తీవ్రంగా విమర్శించారు.కేసు పురోగతిని ఎప్పటికప్పుడు పసిగడుతూ తెలంగాణ ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించాల్సిన పోలీసు అధికారులు తెలంగాణ రాష్ట్రంలో బిజెపి సోషల్ మీడియా మైనర్ బాలికపై చేస్తున్న వికృత చేష్టల దాడిని ఏమాత్రం నియంత్రించకపోవడం బాధగా ఉందన్నారు.విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు ఇచ్చాక కూడా కేసుకు సంబంధించి అరెస్టు పురోగతి ఎక్కడికక్కడ నిలిచిపోవడం తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా వేధిస్తుందన్నారు.పైగా మైనర్ బాలిక పై అసభ్యకరమైన పోస్టులతో మానసికంగా వేధిస్తున్నప్పుడు ఇదంతా కేవలం సాయి భగీరథ్ ఉదాంతం వల్లనే జరిగినందున సోషల్ మీడియాలో మైనర్ బాలికకు బాలిక తల్లిదండ్రులకు జరుగుతున్న అవమానాన్ని ఆవేదనను పరిగణలోనికి తీసుకొని పోలీస్ అధికారులు మరో కేసును ఎందుకు నమోదు చేయడం లేదంటూ సూటిగా నిలదీశారు.విషయం బయటకు పొక్కకు ముందే తన పరువు పోతుందంటూ ముందస్తుగా వెళ్లి కరీంనగర్ పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టుకున్న బండి సంజయ్ కుమారుడు ప్రస్తుతం సోషల్ మీడియాలో మైనర్ బాలిక కుటుంబంపై ఇంతటి దౌర్జన్యాలతో కూడిన ఉచ్చరింపరాని పదజాలాలతో పచ్చి బూతులు తిడుతున్నప్పటికిని మైనర్ బాలికకు తన కుటుంబానికి రక్షణ ఎందుకు కల్పించడం లేదంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు.మరోవైపు బిజెపి మహిళా నేతలు ఇతర మహిళలను ఇష్టమొచ్చినట్లు తిట్టంగా లేనిది సోషల్ మీడియా వేదికగా ఇతర మహిళ నేతలు కేసుపై స్పందించమని వివరణ కోరుతున్న సందర్భంలో తీవ్రమైన ఆవేశానికి ఆక్రోసాలకు గురవుతూ సమాధానాలు దాటేస్తూ మైనర్ బాలిక తరపున సహకరించాల్సిన మహిళా నేతలు పలు పోలీస్ స్టేషన్లలో సమాధానం అడుగుతున్న వ్యక్తులపై కేసులు పెట్టిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.కొత్తగా పార్టీ పెట్టిన కల్వకుంట్ల కవిత రాజకీయాలతో సంబంధం లేని సాయి భగీరథ్ ను వ్యక్తిగతంగా కక్షగడుతూ వేధిస్తున్నారని వెనుకేసుకురావడం వికారంగా ఉందన్నారు.ఫోక్సో కేసు లో జరుగుతున్న విచారణలోని ప్రధాన అంశం మైనర్ బాలికను కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ శారీరకంగా ఉపయోగించుకొని పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడినాడని విచారణ సాగుతుండగా దిక్కుమాలిన సాకులన్నీ ముందట పెట్టుకొని కేసును తప్పు పట్టిస్తుండడం కేసు విచారణ పురోగతిలో తీవ్రమైన జాప్యం చేస్తుండడంతోపాటు కాలయాపనతో కూడిన అరెస్టును మెయిల్స్ సమాచారంతో దాటవేయడం చివరకు న్యాయస్థానంలో న్యాయమూర్తులను సైతం తప్పుదోవ పట్టించే విధంగా, కేసును నీరుగార్చే విధంగా చేయబడుతున్న పద్ధతులు కుట్రలన్ని నశించబడాలన్నారు.

**ఫోక్సో చట్టం కఠినమైనది.**

చిన్నారుల రక్షణ కోసం భారతదేశంలోని చట్టం మార్చబడి ఫోక్సో చట్టంగా అవతరించబడిందని దాని ప్రధాన మూలాలను గమనించగా లైంగిక నేరాల నుండి చిన్నారులకు రక్షణ కల్పించే విధంగా రూపొందించబడిందని జ్ఞాపకం చేశారు. బాల బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించి లైంగిక నేరాల నుండి పిల్లలకు రక్షణ కల్పించడమే చట్టంలోని ప్రధాన లక్ష్యాలని తెలుపుతున్నాయని గుర్తు చేశారు ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ ఎఫెన్సెస్ ఆక్ట్ 2011ను 2012 మే 22నభారత పార్లమెంటు ఆమోదించిందని గుర్తు చేశారు. ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ ఆక్ట్ 2012 గా రూపొందించబడిన చట్టం 2012 నవంబర్ 14న అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. భారతదేశంలోని మహిళా శిశు అభివృద్ధి శాఖ ఒక మార్గదర్శకాన్ని ఆమోదింపజేసి దేశం అంత పాటించే విధంగా కఠినంగా అమల్లోకి తేవడం దేశంలోని బాలల రక్షణ కోసం ఏర్పాటు చేయబడినదిగా గుర్తింపు సాధించిందన్నారు.

**ఫోక్సో చట్టం 2012 ముఖ్య అంశాలు.**

ముఖ్య ఉద్దేశం:-

పిల్లలపై జరిగే లైంగిక నేరాలను నిర్వచించడం శిక్షించడం నివారించడం లాంటివి పరిగణలోనికి వస్తాయని గుర్తు చేశారు.

పిల్లల నిర్వచనం:-

18 సంవత్సరాల వయసు కంటే తక్కువ వయసు కలిగిన బాలికలకు రక్షణ కల్పించడం కోసం మాత్రమే చట్టం వర్తిస్తుంది.

లింగ తటస్థతలి:-

ఆడ, మగ ,భేదం లేకుండా 18 సంవత్సరాల లోపు కలిగిన మైనర్లను రక్షించడానికి ఉపయోగపడుతుంది.

సవరణ:-

మైనర్ బాలికలపై తీవ్రమైన లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తులపై మరణశిక్షతో సహా కఠిన శిక్షలను ప్రవేశపెట్టడానికి 2019లో ఈ చట్టాన్ని సవరించడమైనదని గుర్తు చేశారు. ఇలాంటి మరణ శిక్ష పడేలాంటి కఠినమైన చట్టంలో ముందస్తుబేలు మంజూరు చేయడం లాంటివి గాని మధ్యస్థంగా బెయిల్ కోసం న్యాయస్థానాలను ఆశ్రయించడం లాంటిది ఏ మాత్రం ఉండవని సాక్షాత్తు ప్రధానమంత్రి బంధువులైన ఫోక్సో చట్టం ముందు తలోగ్గాల్సిందేనంటూ అంతటి పకడ్బందీగా 2019లో కేంద్ర ప్రభుత్వం ఫోక్సో చట్ట సవరణను కఠినాతి కఠినంగా మార్చిందని గుర్తు చేశారు.మైనర్ బాలికకు మానసికంగా ధైర్యాన్నిస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అండగా నిలబడిన మొదటి ప్రధాన వ్యక్తులలో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముందు వరుసలో ఉంటుండగా,ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి ఉద్యమ నేత తెలంగాణ శ్యామ్ ఏకంగా మైనర్ బాలికకు రక్షణగా నిలుస్తూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని విచారణలో భాగంగా ముందస్తుగా అరెస్టు చేయాలని ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నట్లు తెలిపారు.అదే సందర్భంలో బక్క జడ్సన్ లాంటి సీనియర్ కాంగ్రెస్ నేత మైనర్ బాలికకు అండగా నిలిచి యావత్ భారతదేశం వికలాంగుల సమాజానికి గౌరవం తెచ్చి పెట్టాడని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రంలో మైనర్ బాలికకు సపోర్ట్ చేయాల్సిన మానవత్వం కలిగిన వ్యక్తులందరూ ఆరాటపడుతూ ఇబ్బందులు పడుతూ అరెస్టులు చేయబడుతూ మైనర్ బాలికకు సహకారంగా నిలబడుతుంటే సోషల్ మీడియాలో మైనర్ బాలిక కుటుంబంపై విరోచితమైన దాడి చేస్తున్నారని ఇదంతా కేవలం ప్రభుత్వం కుట్రకోణంలోని భాగమేనని పేర్కొన్నారు.చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఫోక్సో చట్టాన్ని తప్పుతో పట్టిస్తూ నిందితునికి సహకారం అందించడం పూర్తిగా మానుకోవాలని హితవు పలికారు.తప్పును తప్పని అంగీకరించకుండా తప్పును ఒప్పు చేసుకునే విధంగా చట్టాలను న్యాయస్థానాలను రాజకీయాలను ప్రభావితం చేయడం ఇకనైనా మానుకోవాలని గుర్తు చేస్తూ.రాజకీయంగా ఎంతగా ఎదిగాము అనేది పరిగణలోకి రాదని ఎంతగా నిజాయితీగా నిలబడమనేది మాత్రమే శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు.ప్రస్తుతం పరారీలో ఉన్న బండి సాయి భగీరథ్ ను తక్షణమే అరెస్టు చేసి న్యాయస్థానం ముందు ప్రొడ్యూస్ చేయాలని హెచ్చరించారు.పార్టీల పేరు చెబుతూ రాజకీయ నాయకుల పేరు చెబుతూ మైనర్ బాలికకు అన్యాయం చేయకూడదని పోలీసులు కేసు కట్టిన విధానం తెలియజేస్తుండగా నిందితుడు పోలీసులను సవాల్ చేస్తూ పోలీసులను తప్పుతో పట్టిస్తూ అరెస్టుతో సంబంధం లేకుండా విచారణకు సహకరిస్తాను అని లెటర్ ద్వారా తెలియజేస్తూనే తప్పించుకు తిరుగుతుండడం పోలీసు వ్యవస్థను అవమానపరిచినట్లుగా ఉందని గుర్తు చేశారు.మే 8వ తేదీన నమోదు చేయబడిన ఫోక్సో కేసు సెక్షన్స్ 74 తో పాటు75,11 రెడ్విత్ 12 సెక్షన్స్ కు అదనంగా సిట్ అధికారులు విచారణలో భాగంగా సూచించిన సెక్షన్స్ ఫోక్సో ఆక్ట్ 5(1) రెడ్విత్ 6 సెక్షన్లను అదనంగా జత చేశారని ఇట్టి సెక్షన్లో కేసు ఆధారంగా సుమారుగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష పడే ఆస్కారం ఉందని సెక్షన్స్ వివరాలు తెలియజేస్తున్నాయన్నారు. ఇప్పటికే సైబరాబాద్ టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది బండి సాయి భగీరథ్ ఆచూకీని గాలిస్తూ పట్టుకొని అరెస్టు చేయడం కోసం తీవ్రంగా గాలింపులు చేస్తూ ప్రయత్నిస్తున్నారని తెలిపారు.దినదినం రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను ధర్నాలను ప్రభుత్వ వ్యతిరేకతను పరిగణలోకి తీసుకొని సిట్ అధికారులు కేసు విచారణను మరింత కఠినతరం చేస్తూ ముందుకు సాగుతున్నారని తెలిపారు.ఏదేమైనా అనుకున్న సమయంలో నిందితుడిని రాజకీయాలకు అతీతంగా ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ శాఖ వాళ్ల నిజాయితీని నిరూపించుకోవాలని కోరారు.మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకూ జై భీమ్ సంస్థ యజమానిగా తన పోరాటం అన్ని విధాలుగా విస్తృతస్థాయిలో కొనసాగుతుందని గుర్తు చేశారు.

# బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలి

**కేంద్ర మంత్రి పదవి నుండి బండి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలి**

**పి.డి.ఎస్.యు ఆధ్వర్యంలో కె.యు మొదటి గేటు ముందు బండి భగీరథ్ దిష్టిబొమ్మ దగ్ధం**

**హన్మకొండ, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

గురువారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు ముందు బండి భగీరథ్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మైనర్ బాలికపై నమోదైన పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, అలాగే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కో-కన్వీనర్ పి. అనూష, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. నరసింహారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బోయినపల్లి అజయ్ మాట్లాడుతూ మైనర్ బాలికను మానసికంగా వేధించి, అత్యాచారానికి పాల్పడిన ఘటనలో పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై ఆరు రోజులు గడిచినా ఇప్పటివరకు నిందితుడిని అరెస్టు చేయకపోవడం పోలీస్ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. డబ్బున్న వారికి చట్టాలు చుట్టాలుగా మారుతున్నాయని, పేదలకు మాత్రమే న్యాయం కఠినంగా అమలవుతోందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల రక్షణ, "బేటీ బచావో -- బేటీ పడావో" వంటి నినాదాలు కేవలం మాటలకే పరిమితమైపోయాయని, నిజంగా మహిళల భద్రతపై చిత్తశుద్ధి ఉంటే ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మౌనం వీడి బాధిత మైనర్ బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని, వారికి భద్రత కల్పించాలని కోరారు. అలాగే బాధిత బాలిక ఫోటోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ కుటుంబ పరువును దెబ్బతీస్తున్న వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనర్ బాలికకు న్యాయం చేయాలని సోషల్ మీడియా వేదికగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఆందోళనలు చేస్తున్న వారిని అక్రమంగా అరెస్టు





చేయడం, బెదిరింపులకు పాల్పడడం తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. అలాగే బాధిత కుటుంబంపై బండి భగీరథ్ కుట్రపూరితంగా నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే కొట్టివేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పి.డి.ఎస్.యు, ఇతర విద్యార్థి, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు బి. బాలకృష్ణ, జిల్లా నాయకులు హర్షిత, లోకేష్, దామోదర్, నాగరాజు, గణేష్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్, 13 మే 2026 (జై భీమ్ న్యూస్)**

జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ మినీ కేంద్రాలు, ప్రధాన కేంద్రాల నిర్వహణ కోసం అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అధికారులు తెలిపారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో జిల్లాలోని సంబంధిత కేంద్రాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు మే 15 నుంచి స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు జూన్ 6, 2026 సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఏఎస్‌డబ్ల్యూఓ కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారి వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలకు చెందిన వారి ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని నిబంధనలు పేర్కొన్నాయి. దరఖాస్తుతో పాటు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు ప్రతులు, మీ-సేవ ద్వారా జారీ చేసిన కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, విద్యార్హత సర్టిఫికెట్లు జతపరచాలని అధికారులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఏఎస్‌డబ్ల్యూఓ జి.నరేందర్ (8790559091), జయరాజు (8919813074), కిరణ్ (9550078045)లను సంప్రదించాలని సూచించారు.




# హక్కుల గొంతుక బుర్ర రాములు సర్


**క్లాసులో పాటలు, అణిచివేతపై పోరాటాలు నేర్పిన వ్యక్తి బుర్ర రాములు సర్**
**డి ఎస్ ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్**



**కాకతీయ యూనివర్సిటీ 14/మే /2026(జై భీమ్ న్యూస్)**

మానవ హక్కుల నేత, ఉద్యమల బాటసారి, పీడీత వర్గాల గొంతుక ప్రొఫెసర్ బుర్ర రాములు సర్ 15వ వర్ధంతి సందర్భంగా డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ రోజు కాకతీయ యూనివర్సిటీ ప్రధాన గ్రంథాలయం ముందు వారికీ నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ కామగొని శ్రావణ్ మాట్లాడుతూ కురవతి ఏ మాదిరిగా తాను కరుగుతూ చీకటిని చీల్చుతూ వెలుతురును పంచుతుందో ప్రొఫెసర్ బుర్ర రాములు సార్ కూడ తరగతి గదిలో పాఠాలు చెబుతూనే మరోపక్క పీడిత ప్రజల హక్కుల కోసం, తన ఆరోగ్యం క్షీణిస్తున్న పట్టు వదలకుండా అన్నగారిన వర్గాల గొంతుకై నిలబడ్డ గొప్ప మానవతావాది ప్రొఫెసర్ బుర్ర రాములు సార్ అని అన్నారు. అలాగే నేటి విద్యార్థులు కూడా బుర్ర రాములు సర్ ఆశయాలను, ఆయన పోరాట స్ఫూర్తిని పునికి పుచ్చుకునీ సమాజంలో జరుగుతున్న అణిచివేత దౌరణులపై ప్రశ్నించాలని, బుర్ర రాములు సర్ గురించి మనం మాట్లాడుకుంటున్నామంటే మనం హక్కుల గురించి మాట్లాడుకుంటున్నట్టే అని వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎ యూనివర్సిటీ నాయకులు సురేష్, సతీష్, రవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రామ బుక్‌కీపర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**వరంగల్, మే 13 (జై భీమ్ న్యూస్)**

జిల్లా పేదరిక నిర్మూలన అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో గ్రామ సంస్థలలో ఖాళీగా ఉన్న గ్రామ బుక్‌కీపర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2026-27 సంవత్సరానికి గాను 1బీ గ్రామాల్లో 58 పోస్టులు, 5బీ గ్రామాల్లో 62 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ నుంచి దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను సంబంధిత మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అందజేయాలని, జూన్ 6 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు గ్రామ స్థాయిలో మహిళా సంఘాల లావాదేవీలు, ఖాతాల నిర్వహణ, రికార్డుల పర్యవేక్షణ వంటి బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఆయా గ్రామాలకు చెందిన మహిళలు కావాలని, నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలని సూచించారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కులం మరియు ఆదాయ ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామ మహిళా సంఘాల సిఫార్సు పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం సంబంధిత మండల మహిళా సమాఖ్య కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

# ఇంగ్లీష్ జాతీయ సదస్సు బ్రోచర్ విడుదల

**హన్మకొండ, 14 మే 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ విభాగం ఆధ్వర్యంలో జూన్ 16, 17 తేదీల్లో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం చేతుల మీదుగా ఆవిష్కరించారు. న్యూ లీటరరీ అండ్ లాంగ్వేజ్ హోరిజోన్స్: వాయిసెస్, జానర్స్ అండ్ టెక్నాలజీస్ అనే అంశంపై ఈ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. మేఘనా రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో సాహిత్యం, భాషా అధ్యయనం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కొత్త సాహిత్య ధోరణులు వంటి అంశాలపై దేశవ్యాప్తంగా ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని తమ పరిశోధనా పత్రాలను సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఆచార్య ఆర్. మల్లికార్జున రెడ్డి, ఆచార్య ఎన్. ప్రసాద్, డాక్టర్ బి. రమ, డాక్టర్ కే. మమత, డాక్టర్ టి. శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. సదస్సుకు సంబంధించిన మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు.



# నాలుగు గంటల్లోనే చోరీ కేసు ఛేదన

**ఐదు ఐప్యాడ్‌లతో నిందితుడు అరెస్ట్**




**కేయూ, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండలో జరిగిన ఐదు ట్యాబ్‌ల చోరీ కేసును కేవలం నాలుగు గంటల్లోనే ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కేయూసీ పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాగదీష్ పరమేశ్వర్ (34) అనే వ్యక్తి బుధవారం రాత్రి సమయంలో ఐదు ట్యాబ్‌లను చోరీ చేసినట్లు సమాచారం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి నాలుగు ఆపిల్ ఐప్యాడ్‌లు, ఒక లెనోవో ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును ఛేదించడంలో కేయూసి ఇన్‌స్పెక్టర్ ఎస్. రవి కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కీలకంగా పనిచేశారు. వేగంగా కేసును పరిష్కరించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.

# నిజాంపల్లి మాజీ హెచ్‌ఎం ఉమాదేవిని సస్పెండ్ చేయాలని డీఈవోకు ఫిర్యాదు

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా/ గోరి కొత్తపల్లి, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**




గోరి కొత్తపల్లి మండలం నిజాంపల్లి పాఠశాల ఇన్‌చార్జి మాజీ ప్రధానోపాధ్యాయురాలు కర్రె ఉమాదేవిపై ఆర్థిక అక్రమాల ఆరోపణలు చేస్తూ ఆమెను సస్పెండ్ చేయాలని బీఎస్ఎఫ్ నాయకులు జిల్లా డీఈవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజేందర్ మాట్లాడుతూ, 2024-25 విద్యా సంవత్సరానికి సమగ్ర శిక్ష కింద జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 55 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ మరియు ఆయా పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకొని మాజీ ఇన్‌చార్జి హెచ్‌ఎం కర్రె ఉమాదేవి పాఠశాల నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పాఠశాల అభివృద్ధి, మరమ్మత్తులు, మౌలిక వసతుల కోసం వచ్చిన స్కూల్ గ్రాంట్ నిధులను పాఠశాల విద్యా కమిటీకి సమాచారం ఇవ్వకుండా, ఎలాంటి తీర్మానం లేకుండానే వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకున్నారని తెలిపారు. అలాగే ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు గ్రామంలో సమాచారం ఇవ్వకుండా అర్హత లేని వ్యక్తిని నియమించారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రొసీడింగ్స్ ప్రకారం నెలకు రూ.8 వేల వేతనం ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.6 వేలే చెల్లించి మిగిలిన మొత్తాన్ని స్వప్రయోజనాలకు వినియోగించుకున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఆయా పోస్టును భర్తీ చేయకుండా ఆ పోస్టుకు సంబంధించిన వేతనాన్ని కూడా స్వాహా చేశారని విమర్శించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే డీఈవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ అధికార ప్రతినిధి దుప్పటి సుభాష్, రాష్ట్ర నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అగనంపూడి వద్ద రోడ్డు ప్రమాదం

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

విశాఖపట్నం గాజువాక అగనంపూడిలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నవవధువు మృతి చెందింది. బుధవారం రాత్రి వివాహం జరిగింది. ఆ తర్వాత అత్తారింటికి బయలుదేరి వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వరుడికి గాయాలయ్యాయి. నిన్న రాత్రి నర్సింగరావు, రాజేశ్వరిల వివాహం వాడచీపురుపల్లిలో జరిగింది. వివాహం అనంతరం కొత్త జంట కారులో అగనంపూడికి బయలుదేరింది. మార్గమధ్యంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న పోల్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో పెళ్ళి కూతురు తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఈ ప్రమాదంలో వరుడుకి కూడా గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న మరో ముగ్గురికి కూడా స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. పెళ్ళైన మరుసటిరోజే, కాళ్ళ పారాణి ఆరకముందే నవవధువు మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

# ప్రజల విశ్వాసమే పోలీస్ శాఖకు బలం

**అధికారులు అంకితభావంతో పనిచేయాలి**
**వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్**








**వరంగల్, 14 మే 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

పోలీస్ అధికారులు ప్రజలకు సేవాభావంతో, అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని సంపాదించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు పోలీస్ స్టేషన్‌పై ప్రజల్లో విశ్వాసం పెంపొందించే విధంగా అధికారులు వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హసన్‌పర్తి, కాజీపేట పోలీస్ స్టేషన్లకు నూతన ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్లు మహేందర్, శ్యాంసుందర్ గురువారం సీపీ క్యాంపు కార్యాలయంలో పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు పూల మొక్కను అందజేసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీస్ శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని గౌరవంగా పలకరించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. బాధితుల ఫిర్యాదులపై వెంటనే స్పందిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేసుల విచారణలో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా పనిచేస్తూ, శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ అనేది ప్రజలకు న్యాయం అందించే కేంద్రంగా ఉండాలని, అక్కడికి వచ్చే ప్రతి వ్యక్తికి భరోసా కలిగే విధంగా సిబ్బంది వ్యవహరించాలని కమిషనర్ తెలిపారు. నిజాయితీ, క్రమశిక్షణ, సేవా భావంతో పనిచేస్తే పోలీస్ శాఖకు మరింత గౌరవం పెరుగుతుందని అన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని కమిషనర్‌కు హామీ ఇచ్చారు.

# విశాఖలో మహిళ దారుణ హత్య.. నగల కోసం ఘాతుకం!


**నగరంలోని అక్కయపాలెంలో దారుణం**
**బంగారు ఆభరణాల కోసం 50 ఏళ్ల మహిళ హత్య**
**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ**

**విశాఖపట్నం, జై భీమ్ న్యూస్**



విశాఖపట్నంలో బంగారు నగల కోసం మహిళను హత్య చేసిన దారుణ ఘటన చోటు చేసుకుంది. నగరంలోని అక్కయ్యపాలెం పరిధిలో ఈ దారుణం జరిగింది. శ్రీనివాసనగర్‌లో బంగారు ఆభరణాల కోసం 50 ఏళ్ల పార్వతి అనే మహిళను దుండగులు చంపేశారు. ఆమె చేతులు, కాళ్లు కట్టేసి దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారు. బీరువా తాళాలు ఎక్కడున్నాయో చెప్పాలంటూ ఆమెను తీవ్రంగా హింసించారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న ఏసీపీ లక్ష్మణమూర్తి సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పార్వతి హైదరాబాద్‌లో ఉంటున్నారు. నిన్న రాత్రే ఆమె విశాఖకు వచ్చినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# డిగ్రీల కంటే స్కిల్స్‌కే ప్రాధాన్యం పెంచుతున్న ఏఐ యుగం



**నైపుణ్యాలున్న వారికే భవిష్యత్తులో అధిక అవకాశాలు**

**సోరుపాక అనిల్ కుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం**

**హన్మకొండ, 15 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ఉద్యోగ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. ఒకప్పుడు ఉన్నత విద్య పూర్తి చేస్తే ఉద్యోగం సులభంగా లభిస్తుందనే నమ్మకం ఉండేది. అయితే ప్రస్తుతం పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. కేవలం డిగ్రీల కంటే నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యం పెరుగుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే బ్యాంకింగ్, కాల్ సెంటర్లు, డేటా ఎంట్రీ, కస్టమర్ సపోర్ట్, అకౌంటింగ్ వంటి అనేక రంగాల్లో ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్‌లు మనుషుల పనిని భర్తీ చేస్తున్నాయి. తక్కువ ఖర్చుతో వేగంగా పనులు పూర్తి చేయడానికి సంస్థలు ఏఐ వినియోగాన్ని పెంచుతుండటంతో సంప్రదాయ ఉద్యోగ అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయని యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఏఐను కేవలం ప్రమాదంగా మాత్రమే కాకుండా, కొత్త అవకాశాలకు మార్గంగా కూడా చూడాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. గతంలో కంప్యూటర్ల రాకతో అనేక కొత్త రంగాలు, ఉద్యోగాలు ఏర్పడినట్లే, ప్రస్తుతం కూడా ఏఐకు అనుగుణంగా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా కమ్యూనికేషన్ స్కిల్స్, డిజిటల్ పరిజ్ఞానం, డేటా అనాలిసిస్, ఏఐ టూల్స్ వినియోగం, క్రియేటివిటీ, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి నైపుణ్యాలు భవిష్యత్తులో కీలకంగా మారనున్నాయని పేర్కొంటున్నారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో కూడా మార్పులు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేవలం మార్కులకే పరిమితమైన విద్య కాకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్, స్కిల్ ట్రైనింగ్, ఇంటర్న్‌షిప్‌లు, టెక్నాలజీ అవగాహనపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు మధ్యతరగతి యువతకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని సూచిస్తున్నారు. నిరుద్యోగం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాకుండా, మానసిక ఒత్తిడికి కూడా కారణమవుతోందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ అవకాశాల లేమితో యువతలో ఆత్మవిశ్వాసం తగ్గిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాసంస్థలు, సమాజం కలిసి సరైన మార్గదర్శనం చేయాలని నిపుణులు కోరుతున్నారు. ఏఐ ఎంత అభివృద్ధి చెందినా, మనిషి సృజనాత్మకత, భావోద్వేగం, ఆలోచనా శక్తిని పూర్తిగా భర్తీ చేయలేదని, మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకుంటే యువతకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని వారు పేర్కొన్నారు.

# పైసలిస్తేనే భార్దాన్..! హనుమకొండ జిల్లాలో రైతుల ఆవేదన





**కొనుగోలు కేంద్రాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు**

**స్పందించని పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది**

**హన్మకొండ, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా భార్ధాన్ (వడ్ల సంచులు) కొరతతో రైతులు రోజులు తరబడి కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం రైతులకు సరైన సౌకర్యాలు అందడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని పలు పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు రైతులు ట్రాక్టర్లు, ఆటోలు, ఎద్దుబండ్లతో ధాన్యం తీసుకువస్తున్నారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత "సంచులు లేవు", "స్టాక్ ఇంకా రాలేదు", "రేపు రండి" అంటూ రైతులను తిప్పలు పెడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు తెల్లవారుజాము నుంచే కేంద్రాల వద్ద వేచి చూసినా, సాయంత్రం వరకు కూడా సంచులు అందక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతుల పేర్లు నమోదు చేస్తున్నప్పటికీ, భార్ధాన్ పంపిణీలో పారదర్శకత లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "లిస్టులో పేరు ఉన్నా సంచులు రావు... డబ్బులు ఇస్తే మాత్రం వెంటనే సంచులు ఇస్తున్నారు" అంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్కో సంచికి అదనపు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, మధ్యవర్తులు, కొంతమంది సిబ్బంది రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితితో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు చెబుతున్నారు. భార్ధాన్ అందకపోవడంతో రైతులు ధాన్యాన్ని బహిరంగ ప్రదేశాల్లోనే నిల్వ చేయాల్సి వస్తోంది. మండుతున్న ఎండలతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుండగా, అకాల వర్షాలు పడితే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకసారి ధాన్యం తడిసిపోతే తేమ శాతం పెరిగిందని చెప్పి కొనుగోలు తిరస్కరించే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు. దీంతో రైతుల ఆవేదన మరింత పెరుగుతోంది. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కూడా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు లేకపోవడంతో వృద్ధ రైతులు, మహిళా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టోకెన్లు ఇచ్చినా ధాన్యం ఎప్పుడు తూకం వేస్తారో స్పష్టత లేక రైతులు అయోమయంలో ఉన్నారు. భార్ధాన్ ఎప్పుడు వస్తుందో అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. రైతులు సమస్యలు వివరించినప్పటికీ సంబంధిత పీఏసీఎస్, ఐకేపీ సిబ్బంది స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫోన్ చేసినా స్పందించకపోవడం, కేంద్రాలకు వెళ్లినా సరైన సమాధానం ఇవ్వకపోవడం వల్ల రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం లేక రైతులు ఒకరి దగ్గర నుంచి మరొకరి దగ్గరకు తిరగాల్సి వస్తోందని సమాచారం. ఈ పరిస్థితిపై రైతు సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు సీజన్ ప్రారంభానికి ముందే తగినన్ని భార్ధాన్ సంచులు సిద్ధం చేయాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శిస్తున్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అన్ని కొనుగోలు కేంద్రాలకు తక్షణమే తగినన్ని భార్ధాన్ సంచులు సరఫరా చేయాలని, సంచుల పంపిణీలో పారదర్శకత పాటించాలని, టోకెన్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు ఏడాది పొడవునా కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునే సమయంలో ఇలాంటి సమస్యలు ఎదుర్కోవడం దురదృష్టకరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. జిల్లా అధికారులు



వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల పరిస్థితిని పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# డీజీపీని మర్యాదపూర్వకంగా కలసిన వరంగల్ సీపీ

**వరంగల్, 14 మే 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సివి ఆనంద్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ సన్ ప్రీత్ సింగ్ డీజీపీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కొనసాగుతున్న పోలీసింగ్ విధానం, శాంతిభద్రతల పరిస్థితి, ప్రజా భద్రత కోసం చేపడుతున్న చర్యలపై డీజీపీ సివి ఆనంద్ సీపీతో చర్చించినట్లు సమాచారం. కమిషనరేట్ పరిధిలో అమలవుతున్న వివిధ భద్రతా కార్యక్రమాలు, నేర నియంత్రణ చర్యలు, సాంకేతిక ఆధారిత పోలీసింగ్ విధానాలపై కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని డీజీపీ సూచించినట్లు తెలిసింది.




# మడిపల్లి ఐకేపీ కేంద్రంలో ధాన్య కొనుగోళ్లను పరిశీలించిన హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఏ. మహేందర్



**హసన్‌పర్తి, 14 మే 2026 (జై భీమ్ న్యూస్)**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్య కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా కొనసాగాలని హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ (ఐఓపి) ఏ. మహేందర్ సూచించారు. గురువారం హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న కొనుగోలు కార్యకలాపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానం, తూకం ప్రక్రియ, నిల్వ సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాల తనిఖీలు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ధాన్యం తూకంలో ఆలస్యం లేకుండా చూడాలని, రైతులకు సమయానికి చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశమైన ఇన్‌స్పెక్టర్ మహేందర్, రైతులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. రైతుల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యత అని, వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, ధాన్యం నిల్వ విధానం, రవాణా అంశాలను కూడా ఆయన పరిశీలించారు. రైతులు ఎలాంటి మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఆకస్మిక తనిఖీతో అధికారులు, సిబ్బంది అప్రమత్తమై కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రైతులు కూడా అధికారుల స్పందనపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం దాసరి నారాయణ మాట్లాడుతూ, మడిపల్లి ఐకేపీ ధాన్య కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు పారదర్శకంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. అలాగే రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ, రైతులు దేశానికి వెన్నెముకలని, వారి కష్టానికి తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ధాన్య కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు, ఆలస్యాలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు ఎవరైనా సమస్యలను ఎదుర్కొంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వారికి పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, కొనుగోలు ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంజిత్, కాంగ్రెస్ నాయకులు చిర్ర విజయ్ కుమార్, మాజీ వార్డు సభ్యులు కాందారి రమేష్, ఐకేపీ సిబ్బంది, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్




**హన్మకొండ, 14 మే 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పర్యాటక మొబైల్ మ్యూజియాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ గురువారం ప్రారంభించారు. హనుమకొండ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ మొబైల్ మ్యూజియం మూడు రోజుల పాటు ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన అరుదైన ఛాయాచిత్రాలు, ప్రత్యేక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, ప్రకృతి సోయగాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, వారసత్వ సంపదకు సంబంధించిన వివరాలను విజువల్ ప్రదర్శనల రూపంలో ప్రజలకు అందుబాటులో ఉంచారు. పర్యాటక ప్రాంతాల విశేషాలు, సందర్శనకు సంబంధించిన పూర్తి సమాచారం, పర్యాటకులకు ఉపయోగపడే బ్రోచర్లు, సమాచార పుస్తకాలను కూడా మ్యూజియంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, యువతలో పర్యాటక ఆసక్తిని పెంచడం, తెలంగాణ పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ మొబైల్ మ్యూజియాన్ని తీసుకొచ్చిందన్నారు. ప్రజలు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తెలంగాణ ప్రత్యేకతలను తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరీ అధికారి ఎ. శ్రీనివాస్ కుమార్, ఎన్‌ఐసీ అధికారి శ్రీధర్, జిల్లా పౌర సంబంధాల అధికారి ఎం.డి. అయూబ్ అలీ, టీజీవో అధ్యక్షుడు జగన్ మోహన్, రాజేష్, ప్రవీణ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, సందర్శకులు తదితరులు పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# ప్రభుత్వ వైద్యులు ప్రజాసేవలో ముందుండాలి




**తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హనుమకొండ యూనిట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లం అప్పయ్య**

**హన్మకొండ, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ వైద్యులు తమ సభ్యుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ముందుండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అల్లం అప్పయ్య అన్నారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హనుమకొండ యూనిట్ ఇన్స్టాలేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ వైద్యులుగా ప్రజాసేవను బాధ్యతగా భావించి మరింత అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజలపై వైద్య భారం తగ్గించడంలో ప్రభుత్వ వైద్యుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి. రాజారెడ్డి, కోశాధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఆదర్శ యూనిట్‌గా హనుమకొండ యూనిట్ నిలవాలని కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఏ. శ్రీకృష్ణారావు మాట్లాడుతూ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో సంఘం నిరంతరం కృషి చేస్తోందన్నారు. సభ్యులు సంఘ బాధ్యతలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా తమ విధులను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. పాలనాపరమైన భారం తగ్గించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అదనంగా సివిల్ సర్జన్, డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రస్థానం, సభ్యుల బాధ్యతలను వివరించారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మన్మోహన్ రాజు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్నమనేని జగన్ మోహన్ రావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కోలా రాజేష్ కుమార్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, కార్యదర్శి సోమన్న వేణుగోపాల్, పూర్వ జీడీఏ అధ్యక్షుడు డాక్టర్ సుధీర్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు.

## ఆచార్య బి. సురేష్ లాల్‌కు అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్



**హన్మకొండ, 14 మే 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంకు చెందిన ప్రముఖ అధ్యాపకులు, సాహితీవేత్త ఆచార్య బి. సురేష్ లాల్‌కు విద్యా, సాహిత్య రంగాల్లో చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన "డాక్టర్ ఆఫ్ హానోరిస్ కాజా" (డాక్టర్ అఫ్ హానరీస్ కాసా) అంతర్జాతీయ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. మెక్సికోకు చెందిన వరల్డ్ అకాడమీ అఫ్ లిటరేచర్, హిస్టరీ, ఆర్ట్ అండ్ కల్చర్ (ఎ.ఎం.ఎల్.హెచ్.ఎ.సి) అధ్యక్షుడు డాక్టర్ జేవియర్ రామిరోజ్ ఎస్. ఈ విషయాన్ని అధికారికంగా తెలియజేశారు. విద్యా రంగంలో విశిష్ట బోధనా సేవలు, పరిశోధనలు, సాహిత్య రంగంలో చేసిన రచనలు, సామాజిక చైతన్యానికి అందించిన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. ఆచార్య బి. సురేష్ లాల్‌కు లభించిన ఈ అరుదైన అంతర్జాతీయ గౌరవం పట్ల విశ్వవిద్యాలయ వర్గాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి, ఆచార్య వి. రామచంద్రం ఆయనను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేసి అభినందించారు. అలాగే అధ్యాపకులు, పరిశోధకులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆచార్య సురేష్ లాల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు కాకతీయ విశ్వవిద్యాలయానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పలువురు అభిప్రాయపడ్డారు.

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**




**వరంగల్, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డా. సత్య శారద అన్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) మరియు కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం హన్మకొండలోని అశోక్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన బాల కార్మిక నిర్మూలనపై శిక్షణా కార్యక్రమం (వర్క్‌షాప్)లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ పిల్లల భవిష్యత్తును దెబ్బతీసే తీవ్రమైన సామాజిక సమస్య అని పేర్కొన్నారు. ప్రతి బాలుడు విద్యను అభ్యసించే హక్కు కలిగి ఉన్నాడని, బాల కార్మికత్వానికి బదులుగా వారికి విద్య, సంరక్షణ మరియు సురక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. బాల కార్మికులను గుర్తించడం, వారిని పాఠశాలల్లో చేర్పించడం, పునరావాసం కల్పించడం వంటి అంశాల్లో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వరంగల్ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా జిల్లాలో బాల కార్మికుల గుర్తింపు, రక్షణ మరియు పునరావాస కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎక్కడైనా బాల కార్మికత్వం గమనించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు, పోలీస్ శాఖ ప్రతినిధులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఫార్ములా ఈ-కార్ రేసు - కేటీఆర్ కు నోటీసులు

**కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు**
**జూలై 31న విచారణకు హాజరు కావాలని ఆదేశం**
**ఫార్ములా ఈ రేస్ కేసులో ఏ1గా కేటీఆర్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఫార్ములా ఈ-కార్ రేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఏసీబీ కోర్టు సమన్లు జారీ చేసింది. ఆయనతో పాటు ఏ2గా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3 హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, ఏ4 స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వర్ రావులకు సమన్లు జారీ అయ్యాయి. జూలై 31వ తేదీన విచారణకు హాజరు కావాలని ఏసీబీ కోర్టు అందులో పేర్కొంది. ఈ కేసులో కేటీఆర్ ఏ1గా ఉన్నారు. 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థకు రూ.55 కోట్లు మళ్లించినట్లు ఏసీబీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది.

## డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 24 మందిపై చర్యలు

**ఒకరికి సామాజిక సేవ శిక్ష.. రూ.26,100 జరిమానాలు విధింపు**




**వరంగల్, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 24 మందిని గురువారం కోర్టులో హాజరుపర్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్ రావు, ఏసీపీ టి. సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని గుర్తించారు. పట్టుబడిన వారిని గౌరవ మేజిస్ట్రేట్ రాజ్ నిధి, స్పెషల్ జేఎఫ్‌సీఎం అండ్ నాలుగవ అదనపు జేఎఫ్‌సీఎం సివిల్ జడ్జి, వరంగల్ కోర్టు ఎదుట హాజరుపర్చగా, ఏనుమాముల ప్రాంతానికి చెందిన కొంతం నాగరాజుకు రూ.500 జరిమానాతో పాటు రెండు రోజుల సామాజిక సేవ శిక్ష విధించారు. ఆయన్ను వరంగల్ ఆయుర్వేద ఆస్పత్రికి సామాజిక సేవ నిమిత్తం పంపించారు. మిగిలిన 23 మందికి మొత్తం రూ.26,100 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన మరో వ్యక్తిని కోర్టులో హాజరుపర్చగా, అతనికి రూ.1,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు.

## నీట్ పరీక్ష రద్దుపై రేవంత్ రెడ్డి స్పందన

**పేపర్ లీక్ తో నీట్ పరీక్ష రద్దు**
**పారదర్శకమైన విచారణ జరపాలన్న రేవంత్ రెడ్డి**
**పోటీ పరీక్షలు విద్యార్థుల జీవితాలను నాశనం చేయకూడదని వ్యాఖ్య**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

నీట్ యూజీ 2026 పరీక్ష రద్దు, పేపర్ లీక్ అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా సుమారు 22.79 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంపై కేంద్రం పారదర్శకమైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. పరీక్ష రద్దు నిర్ణయంతో లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, ఇలాంటి ఘటనలు పరీక్షల వ్యవస్థపై ఉన్న విశ్వసనీయతను దెబ్బతీస్తాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలని, విద్యార్థులు మళ్లీ ఇబ్బంది పడకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణమే పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి సూచించారు. పోటీ పరీక్షలు అనేవి విద్యార్థుల ప్రతిభకు వేదిక కావాలి తప్ప, వారి జీవితాలను నాశనం చేసే సాధనాలుగా మారకూడదని ఆయన హితవు పలికారు. ఇదే సమయంలో ఆయన రాజకీయంగా కూడా విమర్శలు గుప్పించారు. పరీక్షల నిర్వహణలో వైఫల్యాలు, పేపర్ లీక్ ఘటనల విషయంలో గత ప్రభుత్వ తీరు, ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ వైఖరి ఒకేలా ఉందంటూ రేవంత్ రెడ్డి చురకలు అంటించారు.

## పింగిళి కళాశాలలో అలుమ్ని మీట్, పేరెంట్స్ మీట్ ఘనంగా నిర్వహణ

**ఉన్నతంగా ఎదగడానికి పింగిళి కళాశాల దోహదపడింది : ప్రొఫెసర్ ఎస్. జ్యోతి**




**హన్మకొండ, 14 మే 2026(జై భీమ్ న్యూస్)**

పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), హనుమకొండలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు అలుమ్ని మీట్, పేరెంట్స్ మీట్ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల అలుమ్ని కమిటీ కన్వీనర్ డా. జి. రేణుక ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్, కళాశాల పూర్వ విద్యార్థి ప్రొఫెసర్ ఎస్. జ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ తాను పింగిళి కళాశాలలో చదవడం వల్లే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగగలిగానని తెలిపారు. విద్యార్థులు శారీరక, మానసిక దృఢత్వంతో పాటు సమాజ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు సెంట్రల్ యూనివర్సిటీల్లో పీజీ సీట్లు సాధించేలా కృషి చేయాలని సూచించారు. పాండిచ్చేరి యూనివర్సిటీలో పీజీ సీటు సాధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లక్ష రూపాయల చెక్కు అందుకున్న పింగిళి విద్యార్థిని శ్రీహితను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే కళాశాలలో చదివి ప్రస్తుతం అధ్యాపకులుగా పనిచేస్తున్న పీడీ సుజాత, డా. శ్రీలత, డా. రేణుక, వైష్ణవి తమ కళాశాల అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాలకు మూలస్తంభాల వంటి వారని, అలుమ్ని మీట్ ద్వారా కళాశాల, పూర్వ విద్యార్థుల మధ్య మరింత సన్నిహిత అనుబంధం ఏర్పడిందన్నారు. అనంతరం అతిథులు, పూర్వ విద్యార్థులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తదనంతరం నిర్వహించిన పేరెంట్స్ మీట్‌లో విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తన, భవిష్యత్ లక్ష్యాలపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం అవసరమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. జి. సుహాసిని, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సురేష్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా. ఎం. అరుణతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానాకు రూ.38 లక్షల వైద్య సామగ్రి అందజేత

**సేవా సంస్థల సహకారం ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరం**

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**హన్మకొండ, 14 మే 2026( జై భీమ్ న్యూస్)**

హనుమకొండ ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానాకు బన్ను ఆరోగ్య సేవ సొసైటీ ఆధ్వర్యంలో రూ.38 లక్షల విలువైన వైద్య వినియోగ వస్తువులు, వైద్య సామగ్రిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు వచ్చే దాతలు, సేవా సంస్థలు మరింతగా పెరగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ దవాఖానలకు సేవా సంస్థల సహకారం ఎంతో అవసరమని, ముఖ్యంగా తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి డొనేషన్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పేద ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సేవా సంస్థల సహకారం వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వ మెటర్నిటీ దవాఖానాలో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో గర్భిణీలు, శిశువులకు వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో బన్ను ఆరోగ్య సేవ సొసైటీ అందజేసిన వైద్య వినియోగ వస్తువులు ఆసుపత్రి సేవల విస్తరణకు ఎంతో దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి సామాజిక సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. బన్ను ఆరోగ్య సేవ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ పేద, అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో సొసైటీ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వ దవాఖానలకు అవసరమైన వైద్య పరికరాలు, వినియోగ వస్తువులు అందించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన చికిత్స అందేలా సహకరిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఆసుపత్రికి అందించిన వైద్య సామగ్రి రోగులకు మెరుగైన సేవలు అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సొసైటీ ప్రతినిధులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ హాల్‌ను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బన్ను ఆరోగ్య సేవ సొసైటీ అధ్యక్షుడు వీరమల్లు చంద్రజిత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. కిరణ్ కుమారి, మేనేజర్ నీతా, మాజీ కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, బోడ డిన్నా, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.




## సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే.. కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ మిస్టరీ వీడింది!

**కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్**

**ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ బీహార్ జైలు నుంచే పథకం రచించినట్లు వెల్లడి**

**ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించిన పోలీసులు**

**బెంగాల్, బీహార్‌లలో నిందితులను పట్టుకున్న ప్రత్యేక బృందాలు**

**మిగిలిన వారి కోసం వివిధ రాష్ట్రాల్లో కొనసాగుతున్న గాలింపు?**



**కరీంనగర్, జై భీమ్ న్యూస్**

కరీంనగర్ పట్టణంలో పట్టపగలే జరిగి సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా 'సుబోధ్ సింగ్ గ్యాంగ్'కు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, మిగిలిన వారి కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. ఈ నెల 3న జరిగిన ఈ దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులకు బుల్లెట్ గాయాలయ్యాయి. దుండగులు 161 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాలను దోచుకెళ్లారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ అని, ప్రస్తుతం అతను బీహార్‌లోని పూర్నియా జైలులో ఉంటూనే ఈ మొత్తం కుట్రకు పథక రచన చేశాడని కమిషనర్ తెలిపారు. సుబోధ్ సింగ్ ముఠాకు బీహార్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో దోపిడీలు చేసిన చరిత్ర ఉందని, ఇంత పకడ్బందీగా తెలంగాణలో దోపిడీ చేయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో దోపిడీకి నాయకత్వం వహించిన పశ్చిమ బెంగాల్ వాసి రఘునాథ్ కర్మకార్‌ను, అలాగే రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో ఇద్దరు షూటర్లు కాగా, మరొకరు వారికి సహాయం అందించిన వ్యక్తి. దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల వంటి ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, చివరకు కరీంనగర్‌ను ఎంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దోపిడీ అనంతరం బైక్‌లపై ధర్మపురికి చేరుకుని, అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారయ్యారు. నిందితుల నుంచి రూ. 51,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు కొనసాగుతున్నందున పరారీలో ఉన్న నిందితుల వివరాలు వెల్లడించలేమని కమిషనర్ తెలిపారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, అలాగే జైలులో ఉన్న సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టు అనుమతి కోరతామని ఆయన వివరించారు.

## ప్రతికూల వాతావరణం కారణంగా హైదరాబాద్‌కు రావాల్సిన రెండు విమానాల దారి మళ్లింపు

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

హైదరాబాద్ లో వాతావరణం ఒక్కసారిగా మారడం వల్ల శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగర శివార్లలో ఆకాశం మేఘావృతమై, ల్యాండింగ్‌కు అవసరమైన స్పష్టత లేకపోవడంతో (రాశీష ఎఱంఱఎఱశ్రీఠఎ), భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు రెండు కీలక విమానాలను దారి మళ్లించారు. పూణె – హైదరాబాద్ (ఇండిగో) విమానాన్ని విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేయించారు. దుబాయ్ – హైదరాబాద్ (ఎమిరేట్స్) అంతర్జాతీయ విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి డైవర్ట్ చేశారు.

## మంత్రి సీతక్కకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత విజ్ఞప్తి

**స్త్రీ నిధిలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలన్న కవిత**

**స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన ఎండీపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**సంస్థను తన గుప్పెట్లో పెట్టుకోవడానికి ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశాడని ఆరోపణ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో చైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమార్కులను దొడ్డిదారిలో కీలక పోస్టుల కొనసాగించేందుకు ఎంతకైనా దిగజారుతోందని విమర్శించారు. తన శాఖలో జరుగుతున్న అక్రమాలపై మంత్రి సీతక్క స్పందించాలని కోరారు. స్త్రీ నిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్త్ర నిధిలో నియామకాలు పారదర్శకంగా జరిగేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

## ఉదయనిధి స్టాలిన్ పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన తెలంగాణ న్యాయవాది

**సనాతన ధర్మంపై మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఉదయనిధి**

**రాష్ట్రపతి కార్యాలయంలో ఫిర్యాదు చేసిన న్యాయవాది రామారావు**

**కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉదయనిధి వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదు**

**ఆయన వ్యాఖ్యలు మీడియాలో, సోషల్ మీడియాలో ప్రసారం కాకుండా చర్యలు తీసుకోవాలని విన్నపం**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు మళ్లీ విమర్శలపాలు అవుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం కార్యక్రమం సందర్భంగా కూడా సభలో ఆయన సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారు. గతంలో కూడా సనాతన ధర్మంపై ఆయన చాలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం మలేరియా, డెంగీ వంటిదని... దాన్ని అంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ వ్యాఖ్యల ప్రభావం డీఎంకేపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎన్నికల్లో డీఎంకే ఓడిపోవడానికి ఈ వ్యాఖ్యలు కూడా ఒక ప్రధాన కారణమే. మరోవైపు సనాతనంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది రామారావు ఏకంగా భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతి కార్యాలయంలో ఉదయనిధి స్టాలిన్‌పై అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలు కేవలం ఒక భావప్రకటన మాత్రమే కాదని, అవి కోట్లాది మంది హిందువుల మత విశ్వాసాలను తీవ్రంగా గాయపరిచేలా ఉన్నాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన విమర్శలు సమాజంలో విద్వేషాలను పెంచే ప్రమాదం ఉందని రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, ఆయన చేసిన ఆ వివాదాస్పద వ్యాఖ్యలు మీడియాలో కానీ, డిజిటల్ సోషల్ మీడియా వేదికల్లో కానీ ప్రసారం కాకుండా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్రపతిని అభ్యర్థించారు.

## ఇక ఫస్టియర్ లోనూ ప్రాక్టికల్స్

**తెలంగాణ ఇంటర్ లో కీలక మార్పులు!**

**విద్యార్థుల్లో ప్రాక్టికల్స్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు**

**2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానం అమలు**

**ఇంటర్ ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

ఇంటర్ విద్యా విధానంలో కీలక మార్పులు చేపట్టేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యామండలి సిద్ధమైంది. 2026–27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఫస్టియర్ నుంచి ప్రాక్టికల్స్, ఫైనల్ పరీక్షకు మార్కుల తగ్గింపు వంటి వివిధ మార్పులు చోటుచేసుకోనున్నాయి. విద్యార్థుల్లో ప్రాక్టికల్ నాలెడ్జ్, కాన్సెప్ట్ ఆధారిత అభ్యాసం పెంచడమే లక్ష్యంగా మార్పులు చేసింది. ఇప్పటి వరకు ఇంటర్ సెకండియర్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించేవారు. ఇక నుంచి ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్ ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విభాగాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఫస్టియర్, సెకండియర్‌లలో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్ నిర్వహణ ఉంటుంది. దీంతో విద్యార్థులు ఫస్టియర్‌లోనూ థియరీతో పాటు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది. మ్యాథ్స్ బోధనలోనూ సంప్రదాయ పద్ధతికి భిన్నంగా, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను తీసుకురానుంది. దీని ద్వారా విద్యార్థులు సూత్రాలను సులభంగా అర్థం చేసుకోవడం, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపుందించుకోవడం, కాన్సెప్ట్ ఆధారిత విద్యను అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మ్యాథ్స్‌లో 75 మార్కులకు ఫైనల్ పరీక్షలు ఉన్నాయి. ఈ మార్కులను 60కి తగ్గించే అవకాశముంది. మిగిలిన మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ప్రాక్టికల్స్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ ఆధారంగా మిగిలిన మార్కులను కేటాయించవచ్చని సమాచారం. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వంటి భాషా విభాగాల్లో కూడా 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ కింద కేటాయించనుంది. సెమినార్లు, అసైన్‌మెంట్లు, క్లాస్ రూమ్ పనితీరు ఆధారంగా మార్కులు కేటాయించే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం ద్వారా విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంతమేర తగ్గించే అవకాశం ఉందని విద్యావేత్తలు భావిస్తున్నారు. దీంతో కేవలం ఫైనల్ పరీక్ష ఆధారంగా మాత్రమే కాకుండా, సంవత్సరం పొడువునా విద్యార్థుల పనితీరును అంచనా వేసే విధానం అమల్లోకి వస్తుంది. విద్యర్థుల్లో సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, ప్రాక్టికల్ నాలెడ్జ్ పెంపొందించే లక్ష్యంతో జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇంటర్ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

## హిందువులకు క్షమాపణ చెప్పిన కమెడియన్ అలీ

**అసలేమిటీ 'ఘర్ సోప్' వివాదం?**


**ఘర్ సోప్ ప్రకటన వివాదంపై క్షమాపణ చెప్పిన నటుడు అలీ**

**సోప్‌కు లక్ష్మీ పూజ చేయడం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శలు**

**సోషల్ మీడియాలో వెల్లువెత్తిన వ్యతిరేకత, బాయ్‌కాట్ పిలుపులు**

**వివాదాస్పద యాడ్‌ను వెంటనే తొలగించాలని కంపెనీని కోరిన అలీ**

**ఎవరినీ కించపరిచే ఉద్దేశం తనకు లేదని వీడియో ద్వారా వివరణ**



**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

టాలీవుడ్ సీనియర్ కమెడియన్ అలీ, తాను నటించిన ఒక వాణిజ్య ప్రకటనపై చెలరేగిన వివాదంపై స్పందించారు. హిందూ సమాజానికి, మనోభావాలు దెబ్బతిన్న ప్రతి ఒక్కరికీ ఆయన బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. ఘర్ సోప్ కోసం ఆయన చేసిన ప్రకటనలో హిందూ మత విశ్వాసాలను అవమానించేలా దృశ్యాలు ఉన్నాయంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో అలీ ఈ మేరకు వివరణ ఇచ్చారు. ఘర్ సోప్ కోసం రూపొందించిన వాణిజ్య ప్రకటనలో నటుడు అలీ ఒక పూజ గదిలో కూర్చుని, ఒక సబ్బు బిళ్లకు లక్ష్మీ పూజ చేస్తున్నట్లు చిత్రీకరించారు. పూలు, ఇతర పూజా సామగ్రితో సబ్బును ఆరాధిస్తూ, నేపథ్యంలో లక్ష్మీదేవికి సంబంధించిన భక్తి గీతాలు వినిపించడం తీవ్ర అభ్యంతరాలకు దారితీసింది. పవిత్రమైన లక్ష్మీ పూజను ఒక సాధారణ సబ్బు ఉత్పత్తికి వాణిజ్య ప్రయోజనాల కోసం ఉపయోగించడం హిందూ ఆచారాలను అపహాస్యం చేయడమేనని పలు హిందూ సంఘాలు, నెటిజన్లు ఆరోపించారు. ఈ ప్రకటన సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, దానిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. వాణిజ్య ప్రచారం కోసం మతపరమైన నమ్మకాలను కించపరచడం సరికాదంటూ బాయ్‌కాట్ పిలుపులు కూడా వచ్చాయి. దీంతో వివాదం పెద్దది కావడంతో అలీ స్పందించక తప్పలేదు. ఈ నేపథ్యంలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన అలీ, "నా ప్రకటన వల్ల ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే నన్ను క్షమించండి. ఏ మతాన్ని గానీ, వారి నమ్మకాలను గానీ కించపరిచే ఉద్దేశం నాకు ఎప్పుడూ లేదు," అని విజ్ఞప్తి చేశారు. ఆ యాడ్ ఒక పాత సినిమాలోని సన్నివేశం స్ఫూర్తితో తీశారని, అయినా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ సదరు ప్రకటనను తక్షణమే తొలగించాలని ఘర్ సోప్ యాజమాన్యాన్ని తాను కోరినట్లు అలీ వివరించారు. అలీ క్షమాపణ చెప్పడంతో ఈ వివాదం కొంతవరకు సద్దుమణిగినా, వాణిజ్య ప్రకటనలలో మతపరమైన అంశాల వినియోగంపై ఈ సంఘటన మరోసారి చర్చకు దారితీసింది.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# మహేష్ బాబు బాలీవుడ్‌లో నటించకపోవడానికి అసలు కారణం ఇదే: రాహుల్ దేవ్

**"బాలీవుడ్ నన్ను భరించలేదు" అంటూ గతంలో మహేష్ బాబు వ్యాఖ్య**
**ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పందించిన నటుడు రాహుల్ దేవ్**
**మహేష్ బాబుకు హిందీ రాదని వెల్లడి**
**అందుకే బాలీవుడ్ లో నటించడంలేదని వ్యాఖ్యలు**



టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేష్ బాబు బాలీవుడ్ ఎంట్రీపై గతంలో చేసిన 'బాలీవుడ్ నన్ను భరించలేదు' అనే వ్యాఖ్య ఎంతటి చర్చకు దారితీసిందో తెలిసిందే. తాజాగా ఈ అంశంపై నటుడు రాహుల్ దేవ్ స్పందించారు. మహేష్ బాబుకు హిందీ భాష రాకపోవడం వల్లే ఆయన బాలీవుడ్ సినిమాలకు దూరంగా ఉంటున్నారని సరదాగా వ్యాఖ్యానించారు. ఇటీవల ఓ హిందీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రాహుల్ దేవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహేష్ వ్యాఖ్యపై అడిగిన ప్రశ్నకు ఆయన నవ్వుతూ, "ఆయనకు భాష రాదు, అందుకే బాలీవుడ్ లో నటించడంలేదు... నిజం అదే" (ఉన్‌కో జుబాన్ నహీ ఆతీ, సహీ బాత్ తో యే హై) అని అన్నారు.  కొన్నేళ్ల క్రితం 'మేజర్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మహేష్ బాబు తన బాలీవుడ్ ఎంట్రీపై స్పందించారు. "నాకు హిందీలో చాలా ఆఫర్లు వచ్చాయి. కానీ వాళ్లు నన్ను భరించలేరని అనుకుంటున్నాను. నా సమయాన్ని వృథా చేసుకోవాలనుకోవడం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తనకు తెలుగు సినిమా పరిశ్రమలో లభిస్తున్న స్టార్‌డమ్, ప్రేమతో సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, మహేష్ బాబు ప్రస్తుతం దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో తన తదుపరి చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. 'వారణాసి' అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాలో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా కీలక పాత్రలు పోషించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# 'పెద్ది' నుంచి 'గౌర్నాయుడు' గ్లింప్స్

**అదరగొట్టిన శివ రాజ్ కుమార్**
**రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబోలో 'పెద్ది'**
**గౌర్నాయుడు పాత్రలో కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్**
**మే 18న ముంబైలో సినిమా ట్రైలర్ లాంచ్**
**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా 'పెద్ది' విడుదల**

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్లు వేగం పుంజుకున్నాయి. ఈ క్రమంలో, చిత్రంలోని అత్యంత కీలకమైన గౌర్నాయుడు పాత్రకు సంబంధించిన వీడియో గ్లింప్స్‌ను చిత్రబృందం సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ పవర్‌ఫుల్ పాత్రను కన్నడ స్టార్ శివ రాజ్ కుమార్ పోషిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా విడుదలైన ఈ వీడియో, సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. రూరల్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ నటిస్తోంది. ఇప్పటికే గౌర్నాయుడు పాత్ర ఫస్ట్ లుక్ పోస్టర్ ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఇప్పుడు వీడియోతో ప్రచారంలో కొత్త జోష్ నింపారు. ఈ సినిమాపై ఉన్న భారీ అంచనాలకు తగ్గట్టే ప్రమోషన్లను కూడా అదే స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇక, చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా మే 18న ముంబైలో 'పెద్ది' ట్రైలర్‌ను గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. అలాగే, మే 23న భోపాల్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమంలో పాటను లాంచ్ చేసేందుకు ప్లాన్ చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, జూన్ 4న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.





# ఆ వివాదం నాలో మార్పు తెచ్చింది

**లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా మీనన్**
**ప్రభాస్ గురించి జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు నిత్యామీనన్ సమాధానంపై అప్పట్లో దుమారం**
**ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేశారన్న నిత్యామీనన్**
**ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండకూడదని నిర్ణయించుకున్నానని వెల్లడి**

తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు. ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు. కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు.  దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫొటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారిపోయానని వెల్లడించారు.